రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

# బిఆర్ఎస్ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలి

### మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**మహేశ్వరం, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కందుకూరు, మహేశ్వరం మండలాల భారత రాష్ట్ర సమితి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశాన్ని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నిర్వహించారు. ఈ సమావేశంలో కందుకూరు మండలంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేస్తూ, గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. రానున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆమె స్పష్టం చేశారు. ఇప్పటి నుంచే ప్రజల మధ్య చురుకుగా పనిచేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్న అంశాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులు, కార్యకర్తలకు ఆమె హిత బోధ చేశారు. ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి అంకిత భావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ కందుకూరు మండల అధ్యక్షులు మన్నే జయేందర్ ముదిరాజ్, చంద్రశేఖర్, సురేందర్ రెడ్డి పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, మండల నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, పార్టీ అభిమానులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతూన్న సబితా ఇంద్రారెడ్డి



సిఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పి

## అనంతగిరికి
# నేడు సిఎం రాక

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** వికారాబాద్ మరోసారి వార్తల్లోకి ఎక్కనున్నది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులకు 10 రోజుల శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నారు. తెలంగాణ ఊటీగా పిలువబడే అనంతగిరి కొండలపై

### కొండలపై ఎఐసిసి శిక్షణ తగరతులు- హరిత రిసార్ట్స్‌లో నేడు ప్రారంభం
### హాజరు కానున్న సిఎం రేవంత్‌రెడ్డి - రెండు తెలుగు రాష్ట్రాల నుంచి
### తరలిరానున్న 77 మంది డిసిసి అధ్యక్షులు - డిసిసి అధ్యక్షులకు 10
### రోజులు శిక్షణ - అతిథుల కోసం రిసార్టులో 40 గదులు - సిఎం పర్యటన
### ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పి

నిర్మించిన హరిత రిసార్టులో ఈనెల 21న ప్రారంభించనున్నారు. కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు హాజరుకానున్నారు. సీఎం, ప్రముఖుల పర్యటన నేపథ్యంలో జిల్లా అధికారుల బృందం ఏర్పాట్లను పర్యవేక్షించింది. అనంతగిరి రిసార్టులో రూములన్నీ బుక్ చేశారు. రెండు రాష్ట్రాలకు చెందిన 77 మంది డీసీసీ అధ్యక్షులు శిబిరానికి హాజరుకానున్నారు. రిసార్టులో 40 గదులు ఉన్నాయి. ప్రతి గదిలో ఇద్దరికి సదుపాయం కల్పించనున్నారు.

**ఏర్పాట్లను పరిశీలించిన అధికార యంత్రాంగం**

అనంతగిరికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో రానుండటంతో జిల్లా పోలీసు యంత్రాంగం అలర్ట్ అయింది. శుక్రవారం అనంతగిరి హరిత రిసార్ట్స్ ప్రాంతాన్ని జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఇంటెలిజెంట్ సీఎం సెక్యూరిటీ వింగ్ ఎస్పీ చటర్జీ, కృష్ణ , డిఎస్పితో కలిసి పరిశీలించారు. ఎస్ఎపి గ్రౌండ్‌లో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు సుధీర్, రాజేశ్వరి, ఆర్డిఓ వాసు చంద్ర, ఫారెస్ట్ అధికారి జ్ఞానేశ్వర్ మున్సిపల్ కమిషనర్ విక్రం నరసింహారెడ్డి ఆర్ఎంబి అధికారి శ్రీధర్ వికారాబాద్ ఎమ్మార్వో లక్ష్మీ నారాయణ, ఆర్టీవో వెంకటరెడ్డి, డి ఎం హెచ్ ఓ స్వర్ణ కుమారి, ఎలక్ట్రిసిటీ డీఇ రవి ప్రసాద్, ఎక్సైస్ సూపరింటెంట్, విజయ భాస్కర్, పిసిసి అధ్యక్షుడు ధారాసింగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్, ఉన్నత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అందులో నాలుగు సాధారణ సూట్ రూములు, రెండు వీఐపీ సూట్ రూములు ఉన్నాయి. ఒక్కో గది రోజుకు రూ.1900 ఉండగా వీకెండ్‌లో అదనంగా వెయ్యి రూపాయలు వసూలు చేస్తారు. సూట్ గదులకు, వీఐపీ సూట్‌ల ఛార్జీలు మరీ ఎక్కువగా ఉంటాయి. రూముల అద్దె కింద రోజుకు రూ.80 వేల చొప్పున 10 రోజుల కోసం రూ.8 లక్షల వరకు రిసార్టుకు ఆదాయం లభిస్తుంది. భోజన వసతులు కూడా ప్రత్యేకంగా కల్పించనున్నారు. గత కొంతకాలంగా హరిత రిసార్ట్ రెస్టారెంట్ మూతపడింది.

దానివల్ల ప్రత్యేక కేటరింగ్ ద్వారా భోజన వసతులు కల్పిస్తారని సమాచారం. ఇలా ఉండగా గత 23 ఏళ్లుగా వికారాబాద్ ప్రాంతానికి చాలా ప్రాధాన్యత లభిస్తోంది. 2003 ఏప్రిల్‌లో వైయస్ రాజశేఖరరెడ్డి పాతయాత్ర ఇదే ప్రాంతం (చేవెళ్ల) నుంచి శ్రీకారం చుట్టారు. ఐదు రోజుల పాటు సాగిన యాత్రలో జిల్లా ప్రజలతో మంచి అనుబంధం పెంచుకున్నారు. అప్పట్లో అధికారంలోకి రాగానే ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలన్నీ ఇక్కడి నుంచే శ్రీకారం చుట్టారు.
నాటి నుంచి వికారాబాద్ ప్రాంతానికి ఎంతో ప్రాధాన్యత ఏర్పడింది. తాజాగా సీఎం రేవంత్ కూడా ఉమ్మడి తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరం ఇక్కడే ఏర్పాటు చేయడం విశేషం.

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కూడా ఏర్పాట్లపై ఆరా తీసినట్లు సమాచారం. వీఐపీల రద్దీ పెరుగుతున్నందున భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వీకెండ్‌లో అనంతగిరికి వచ్చే పర్యాటకులు తమ పర్యటన వాయిదా వేసుకోవడం మంచిదని స్థానికులు అంటున్నారు.

# వారి స్పెషల్ ఏంటి?



### కౌంటింగ్ కేంద్రాల్లో నిఘా వర్గాల హల్‌చల్
### ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలనే అత్రుత
### ఫలితాల వివరాలు ఇవ్వాలని ఆర్ఓలపై ఒత్తిడి
### అధికారికంగా జాబితాలు సిద్ధం చేయకుండానే ఫొటోలు చిత్రీకరణ
### ఇదంతా రాజకీయ పార్టీలకూ చేరవేస్తున్నారా?
### కౌంటర్లలోకి స్పెషల్ బ్రాంచ్, ఇంటెలిజెన్స్ సిబ్బంది రావచ్చా?
### వారికి ఎన్నికల సంఘం అనుమతులు ఉన్నాయా?
### ఈసి, పోలీసు ఉన్నతాధికారులు సైతం కేబిన్ బయటి నుంచి పరిశీలన
### స్పెషల్ బ్రాంచ్, ఇంటలిజెన్స్ సిబ్బంది ఎంట్రీకి అనుమతిపై ఆదేశాలు లేవంటున్న ఎన్నికల అధికారులు
### జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల నాటికైనా స్పష్టత ఇవ్వాలని సూచన

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** ఓట్ల లెక్కింపు సందర్భంగా పోలీసు నిఘా వర్గాల తీరుపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. కౌంటింగ్ హాళ్లలోకి అనుమతులు లేకుండా స్పెషల్ బ్రాంచ్, ఇంటలిజెన్స్ సిబ్బంది ప్రవేశిస్తున్నారని తెలుస్తోంది. ఉన్నతాధికారులకు ఇన్ఫర్మేషన్ ఇవ్వాలనే అత్రుతతో నిబంధనలకు పాతర వేస్తున్నారు. ఒకవైపు ఓట్ల లెక్కింపు జరుగుతుండగా మరోవైపు నిఘా వర్గాలు తరచూ కౌంటర్లలోకి ప్రవేశిస్తున్నాయి. సమాచారం ఇవ్వాలని రిటర్నింగ్ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. గ్రామపంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా నిఘా వర్గాలు అనుసరించిన తీరుపై అసహనం వ్యక్తమవుతోంది. పదే పదే అధికారుల వద్దకు వచ్చి ఏ పార్టీకి ఎన్ని ఓట్లు వచ్చాయంటూ ప్రశ్నల వర్షం కురిపించారని తెలిసింది. అధికారులు ఇంకా జాబితా బహిర్గతం చేయక ముందే ఫొటోలు తీసి ఉన్నతాధికారులకు నివేదించారని సమాచారం. అసలు వారికి కౌంటింగ్ హాళ్లలోకి ప్రవేశించేందుకు ఎన్నికల సంఘం నుంచి అనుమతులు ఉన్నాయా, లేవా అనే విషయమై స్పష్టత కరువైంది. ఇదే విషయమై పలువురు రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

సదరు సిబ్బందికి సమాచారం ఇచ్చేందుకు నిరాకరించినట్లు తెలిసింది. పోటీ చేసిన అభ్యర్థులను సైతం కౌంటింగ్ కేబిన్లలోకి అనుమతించరాదన్న నిబంధనలు ఉన్నాయి. ఎన్నికల సంఘం అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు కూడా కేబిన్ బయటి నుంచి పరిశీలించి వెళ్లిపోతుంటారు.

ఈ సిబ్బంది లోపలకు ప్రవేశించడం పట్ల అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా ఓ రిటర్నింగ్ అధికారి సమాచారం చెప్పేందుకు నిరాకరించినట్లు తెలిసింది. నిఘా వర్గాలకు ఎలాంటి అనుమతులు ఉన్నాయో తమకు స్పష్టమైన ఆదేశాలేమీ లేవంటూ స్పష్టం చేశారని సమాచారం.

దాంతో చేసేదేమీ లేక సదరు సిబ్బంది మరో కౌంటర్‌లోకి వెళ్లిపోయారని తెలిసింది. తమ వద్ద సేకరించిన సమాచారం ఉన్నతాధికారులకు వెళుతుందా, లేక రాజకీయ పార్టీలకు చేరవేస్తున్నారా అనే సందేహాలు కూడా వ్యక్తం చేశారు. నిఘా వర్గాలను కౌంటింగ్ కేబిన్లలోకి అనుమతించాలా, వద్దా అనే విషయమై ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నారు. రానున్న జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల వరకైనా జీవోలు ఇవ్వాలని అంటున్నారు.

# నాలుగు నెలలుగా పస్తులు

### ఎంపిడివో ఆఫీసుల్లో కంప్యూటర్ ఆపరేటర్ల ఆకలి కేకలు
### జిల్లాలో 72 మంది దయనీయ పరిస్థితి
### జీతాలు అందక అప్పుల ఊబిలో ఆపరేటర్ల కుటుంబాలు

**రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాలనలో కీలక పాత్ర పోషిస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ల జీవితం నేడు అక్షరాలా కన్నీటి గాథగా మారింది. డిజిటల్ ఇండియా, పేపర్‌లెస్ గవర్నెన్స్ అంటూ గొప్పలు చెప్పుకుంటున్న పాలనలో.. ఆ వ్యవస్థను నడిపిస్తున్న ఉద్యోగుల కడుపు మాత్రం ఖాళీగానే ఉంది. రంగారెడ్డి జిల్లాలోని వివిధ మండల పరిషత్ కార్యాలయాల్లో పనిచేస్తున్న 72 మంది కంప్యూటర్ ఆపరేటర్లకు గత నాలుగు నెలలుగా ఒక్క రూపాయి కూడా జీతం అందలేదు. ఫలితంగా వారి కుటుంబాలు తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాయి.



ప్రభుత్వ పథకాల డేటా ఎంట్రీ నుంచి నివేదికల ఆన్‌లైన్ అప్‌లోడ్ దాకా ప్రతి పనిలోనూ కంప్యూటర్ ఆపరేటరే కీలకం. ఉదయం నుంచి సాయంత్రం వరకు మానిటర్ల ముందే కూర్చుని ప్రజాసేవలను సాఫీగా సాగిస్తున్న వారికి వేతనం చెల్లించడంలో మాత్రం నిర్లక్ష్యం కొనసాగుతోంది. పనులు చేయించుకోవడంలో చూపే శ్రద్ధ, వారి కనీస అవసరాలు తీర్చడంలో చూపడం లేదన్న ఆరోపణలు జిల్లా యంత్రాంగంపై వెల్లువెత్తుతున్నాయి. నాలుగు నెలలుగా జీతం లేకపోతే కుటుంబాన్ని ఎలా పోషించాలి... అంటూ ఆపరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి అద్దెలు కట్టలేక యజమానుల ఒత్తిళ్లు, పిల్లల ఫీజులు చెల్లించలేక విద్యపై ఆందోళన నిత్యావసరాల కోసం అప్పుల చుట్టూ తిరుగుడుఇలా ప్రతి రోజు నరకప్రాయంగా గడుస్తోందని వారు వాపోతున్నారు.

**అధికారుల నిర్లక్ష్యం వీడాలి..**

పనులు ఆగకూడదంటూ ఒత్తిడి తెచ్చే అధికారులు, వేతనాల విషయం వచ్చేసరికి మాత్రం త్వరలో వస్తాయి అంటూ కాలం గడుపుతున్నారని ఆపరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బకాయి వేతనాలను వెంటనే విడుదల చేయాలని లేనిపక్షంలో విధుల బహిష్కరణతో పాటు ఆందోళన బాట పట్టాల్సి వస్తుందని వారు హెచ్చరిస్తున్నారు.



# రోజుకో మలుపు

### హైకోర్టు మెట్లెక్కిన ఇబ్రహీంపట్నం మున్సిపల్ పంచాయతీ
### చైర్మన్ పీఠంపై వీడని సందిగ్ధత..
### కిడ్నాప్ డ్రామాలు.. తప్పుడు ధ్రువీకరణ పత్రాల ఫిర్యాదులు
### కౌంటర్ దాఖలు చేయాలని ఎన్నికల కమిషన్‌కు హైకోర్టు ఆదేశం

**ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో రాజకీయ సెగలు చల్లారడం లేదు. చైర్మన్ ఎన్నిక చుట్టూ తిరుగుతున్న పరిణామాలు చివరకు న్యాయస్థానానికి చేరాయి. ఒకవైపు కిడ్నాప్ ఆరోపణలు, మరోవైపు కౌన్సిలర్ల అర్హతలపై ఫిర్యాదులతో మున్సిపల్ పరువు కాస్తా హైకోర్టు గడపెక్కింది. తాజాగా చైర్మన్ ఎన్నిక ప్రక్రియలో జాప్యంపై హైకోర్టు సీరియస్ అయింది. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక వేళ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. కౌన్సిలర్ ఆకుల యాదగిరిని కిడ్నాప్ చేశారంటూ ఆయన సతీమణి హైకోర్టులో హేబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయడం సంచలనం సృష్టించింది. ఈ పంచాయతీ ఒక కొలిక్కి రాకముందే, కౌన్సిలర్ల అర్హతలపై వరుస ఫిర్యాదులు వెల్లువెత్తాయి. మున్సిపాలిటీలో గెలిచిన ప్రత్యర్థి అభ్యర్థులపై కాంగ్రెస్ నాయకులు న్యాయ పోరాటానికి దిగారు. 23వ వార్డులో గెలుపొందిన బిఆర్ఎస్ అభ్యర్థి నీలం శ్వేత తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం సమర్పించి గెలిచారని, ఆమె ఎన్నికను రద్దు చేసి రెండో స్థానంలో ఉన్న తనకు అవకాశం ఇవ్వాలని కాంగ్రెస్ అభ్యర్థి చెన్నమోని చంద్రకళ హైకోర్టును ఆశ్రయించారు. ఇది ఇలా ఉంటే 21వ వార్డు నుండి గెలుపొందిన బిఆర్ఎస్ కౌన్సిలర్ చిలుకల బుగ్గరాములుకు రెండు చోట్ల ఓటు హక్కు ఉందని కాంగ్రెస్ అభ్యర్థి ఈగల రాములు ఆరోపించారు. తులెకలాన్ గ్రామపంచాయతీతో పాటు ఇబ్రహీంపట్నంలోనూ ఓటు నమోదు చేసి నిబంధనలు ఉల్లంఘించారని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక పూర్తయినప్పటికీ అధికారులు ఎన్నిక ప్రకటించడం లేదని బిఆర్ఎస్ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి టేకుల సుదర్శన్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. అదేవిధంగ వైస్ చైర్మన్ ఎన్నికను మిగతా 2లో

# షాద్‌నగర్ అడిగినవన్నీ ఇవ్వండి

### హెచ్ఎండిఏ కమిషనర్‌కు సిఎం ఆదేశం
### నూతన కౌన్సిలర్ల బాధ్యతల స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే వెల్లడి
### అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా పనిచేయాలని హితవు

**షాద్‌నగర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** ప్రస్తుతం పార్టీ ఏదైనప్పటికీ గెలిచిన వారందరూ సమర్థులే.. పార్టీలకు అతీతంగా పనిచేయండి... యువకుల సంఖ్య ఎక్కువగా ఉంది.. మీ యువశక్తిని చాటండి.. ఎమ్మెల్యేగా నేను మీ వెన్నంటే ఉంటాను..షాద్ నగర్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపల్ కొత్త చైర్మన్ గా అగ్గనూరు బసవేశ్వర్, వైస్ చైర్మన్ గా అందెమోహన్ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే నూతన చైర్మన్, వైస్ చైర్మన్లతో పాటు కాంగ్రెస్, టిఆర్ఎస్, బిజెపి ఇండిపెండెంట్ పార్టీల కౌన్సిలర్లకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్టీలు, నాయకులు వస్తుంటారు.. పోతుంటారు.. కానీ గెలిపించిన ప్రజలు పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా పనిచేసే తమదైన ముద్రవేయాలని అప్పుడే గెలిచినవారు సమర్థులు అవుతారని సూచించారు. బాధ్యతగా వ్యవహరిస్తూ ప్రజలతో అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించే దిశగా బాధ్యతగా ఉండాలని హితవు చెప్పారు. కౌన్సిలర్లు అందరూ పార్టీలను పక్కనపెట్టి అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని అన్నారు. గెలిచిన చైర్మన్ నుండి కౌన్సిలర్ దాకా అందరూ ప్రజలకు అణిగిమనిగి పని చేయాలని సూచించారు. ఎమ్మెల్యేగా తాను నిరంతరం కౌన్సిలర్లకు అండగా ఉంటానని, పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరిస్తానని వెల్లడించారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఈ విషయంలో కౌన్సిలర్లకు తన సహకారాన్ని అందిస్తాడని ఆయన స్పష్టం చేశారు. రెండు పార్టీల్లో యువకులే ఉన్నారని, సమర్థవంతంగా పనిచేసే షాద్ నగర్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్ది యువ సత్తాను చాటాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

**సిఎం చాలా సంతోషించారు**

మున్సిపాలిటీ ఎన్నికల్లో షాద్ నగర్ గెలిచిన సంగతి చెప్పగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతో సంతోషపడ్డారని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. వెంటనే హెచ్ఎండిఏ కమిషనర్‌తో మాట్లాడి షాద్ నగర్ మున్సిపాలిటీ అభివృద్ధికి ఏం కావాలన్నా చేయాలని సూచించారని తెలిపారు. దీనిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుందామని కౌన్సిలర్లకు వెల్లడించారు. అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలు ఏవైనా ప్రజలు మాత్రం సమర్థులనే ఎన్నుకున్నారని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఎన్నికలలో కాంగ్రెస్ విజయానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి శ్యామసుందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం, కాశీనాథ్ రెడ్డి, శివ శంకర్ గౌడ్, రఘునాయక్, మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ తదితరులను ఆయన అభినందించారు. కౌన్సిలర్లు పాలన బాగుండేలా, అవినీతి రహితంగా పాలించాలని సూచించారు. అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవకాశం ఇచ్చిన ప్రజలకు ఎప్పుడు పనిచేసేందుకు సంసిద్ధులై ఉండాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. మున్సిపల్ కౌన్సిలర్లకు పాలకవర్గానికి అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అభినందనల సన్మానాల వెల్లువ షాద్ నగర్ మున్సిపల్ కొత్త పాలకవర్గం కొలువుదిరిన వేళ వారికి అభినందనలు సన్మాన సత్కారాలు భారీ ఎత్తున జరిగాయి. ఎమ్మెల్యే శంకర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి శ్యాంసుందర్ రెడ్డి శివశంకర్ గౌడ్ రఘునాయక్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్ ఇంకా పార్టీ క్యాడర్ పుర ప్రముఖులు పెద్ద ఎత్తున హాజరై వారికి అభినందనలు తెలుపుతూ శాలువాలు పూల బొకేలతో ఘనంగా సన్మానించారు.



మున్సిపల్ పాలకవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే



ఆమనగల్లు చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ బాధ్యతల స్వీకారోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

# కలసికట్టుగా అభివృద్ధి చేద్దాం

### పట్టణ ప్రగతి కోసం అన్ని పార్టీలు ఏకతాటిమీదకు రావాలి
### ఎమ్మెల్యే కసిరెడ్డి పిలుపు

**ఆమనగల్లు, ఫిబ్రవరి20, ప్రభాతవార్త:** గ్రామాభివృద్ధి సాధించాలంటే అన్ని పార్టీలు ఏకతాటి మీదకి రావలసిన అవసరం ఎంతైన ఉందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రాజకీయాలను ఎన్నికలకే పరిమితం చేసి తరువాత ప్రజాసమస్యల పరిష్కారం, అభివృద్ధి కోసం కలిసి వస్తేనే అది సాధ్యపడుతుందని ఆయన తెలిపారు. ఆమనగల్లు మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ పదవిబాధ్యతల కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, బిజెపినేత, జాతీయ ఓబిసి కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ముఖ్య అతిథులుగా హాజరైనారు. అంతకు ముందు చైర్‌పర్సన్ నేనావత్‌పత్యానాయక్, వైస్ చైర్మన్ తల్లోజు గీత ఆచారి, కౌన్సిలర్లు సంప్రదాయ పద్దతిలో పదవి బాధ్యతలు స్వీకరిచగా, ఎమ్మెల్యే కసిరెడ్డి, తల్లోజు ఆచారితోపాటు మార్కెట్ కమిటి చైర్మన్ యాటగీతనర్సింహ్మా, ఠాకూర్ బాలాజీ సింగ్, ఆయిళ్ళ శ్రీనివాస్‌గౌడ్, పలు రంగాల ప్రముఖులు హాజరై పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మున్సిపాలిటి కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ సహకారం కొరవడి ఆమనగల్లు మున్సిపాలిటీ పూర్తిగా వెనుకబాటుకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు మండలాలకు కేంద్రబిందువైన ఆమనగల్లును అన్ని రంగాలలో సమాగ్రాభివృద్ధి సాధించేలా కృషి చేస్తానన్నారు. అభివృద్ధికి, ఎన్నికల ఫలితాలకు ఎటువంటి ముడిపెట్టకుండా న్యాయబద్ధంగా, చిత్తశుద్ధితో ముందుకు సాగుతానని, అందుకు ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉంటుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆమనగల్లు మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు ఇచ్చిన కూడా తన బాధ్యతను మరిచిపోనని, పూర్వ మిగతా 2లో

## మున్సిపాల్టీని అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తాం

**చేవెళ్ల, జనవరి 20, ప్రభాతవార్త:** చేవెళ్ల మున్సిపల్ ను అంచెలంచెలుగా అభివృద్ధి చేస్తామని చేవెళ్ల శాసనసభ్యులు కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని రూ.10 లక్షల నిధులతో నిర్మించే సిసి రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలె యాదయ్య మాట్లాడుతూ.. గ్రామీణా ప్రాంతాల్లోని ప్రతి పేద వాడి కలను నిజం చేయడానికి ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు. ప్రతి నిరుపేద ఆడబిడ్డకు ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇవ్వాలనే లక్ష్యంతో పాటు పడుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబానికి రూ.5 లక్షల రూపాయలతో ఇండ్లను నిర్మించుకోవడానికి అవకాశం కల్పించిందని అన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల అందజేస్తోందని తెలిపారు. ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ పథకాలు చేరవేయడం మన కర్తవ్యంగా భావించాలని కార్యకర్తలకు సూచించారు. చేవెళ్ల నియోజకవర్గంలోని ప్రజలు ముందుకు వచ్చి ప్రభుత్వం ఇచ్చే పథకాలను, అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. చేవెళ్ల ప్రాంతాన్ని ఆర్థికంగా బలంగా ఉండేలా మహిళల, యువత, పేద మధ్యతరగతి ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధికి ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు అంతా సహకరించాలని కోరారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ప్రభుత్వ పథకాలను పేద ప్రజల దరికి తీసుకెళ్లేలా కృషి చేయాలి సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి, చేవెళ్ల మున్సిపల్ వైస్ చైర్మన్ కాసుల రాము గౌడ్ కౌన్సిలర్ లు బండారు శైలజా ఆగి రెడ్డి, మంగలి కల్యాణి యాదగిరి, మద్దెల శ్రీనివాస్, ముడావత్ క్రిష్ణ నాయక్, ఫైండ్ల మధుసూదన్ రెడ్డి, తాళ్ల పల్లి నర్సింలు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు బండారు ఆగి రెడ్డి, చేవెళ్ల పిఎసిఎస్ మాజీ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మంగలి యాదగిరి, పల్గుట్ట రాం రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మాజీ వైస్ ఎంపిపి కర్నె శివకుమార్, బండారు వెంకట్ రెడ్డి, అత్తెల్లి రవీందర్ రెడ్డి, వడ్ల ఆనంద్, బీర్ల గణేష్, అత్తెల్లి రమణారెడ్డి, అశోక్, పాండు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

## అన్నా.. వదినకు మున్సిపల్ చైర్మన్ పాదాభివందనం

**షాద్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** మున్సిపాలిటీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో అన్న మున్సిపల్ మాజీ చైర్మెన్ అగ్గనూరు విశ్వం, అలాగే వదిన మాజీ సర్పంచ్, ప్రస్తుత కౌన్సిలర్.. విశాలకు సంబంధించిన ఓ సన్నివేశం అందర్నీ ఆకట్టుకుంది. అయితే పూజా కార్యక్రమాల అనంతరం బాధ్యతలు తీసుకున్న అగ్గునూరు బస్వం వద్దకు విశ్వం విశాల దంపతులు శుభాకాంక్షలు తెలపడానికి తమ్ముడు బస్సులో వద్దకు వచ్చారు. వారిని చూసిన చైర్మన్ బస్వం అన్నా వదినలకు వినమ్ర పూర్వకంగా పాదాభివందనం చేయడం అక్కడ అందరిని ఆకర్షించింది. రాజకీయ అనుభవమున్న తన అన్న వదినల ఆశీస్సులు తీసుకోవడం ద్వారా అటు కుటుంబం బంధాన్ని, ఇటు రాజకీయ బంధాన్ని అందరూ గుర్తు చేసుకున్నారు.


అన్నవదినల ఆశీర్వాదం తీసుకుంటున్న మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్

## ఎన్నికల వరకే పార్టీ బేధాలు..
## ఆ తర్వాత ఒకటవుదాం

**షాద్‌నగర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** ఒగ్గు కిషోర్.. నువ్వు అపర చాణుక్యుడివి అంటూ షాద్ నగర్ ఎమ్మెల్యే శంకర్ బిఆర్ఎస్ పట్టణ లీడర్, 16వ వార్డు మహిళా కౌన్సిలర్ ఒగ్గు జయలక్ష్మి మ్మ భర్త గురించి ఎమ్మెల్యే శంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్, వైస్ చైర్మన్‌లు ఇరువురుతో పాటు కౌన్సిలర్లు పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యేను కౌన్సిలర్లు అందరూ పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇచ్చి సన్మానించారు. ఈ సందర్భంగా 16వ వార్డు బిఆర్ఎస్ మహిళా కౌన్సిలర్ ఒగ్గు జయలక్ష్మి మ్మ, ఆమె భర్త కిషోర్ కలిసి ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూడా ఎన్నికల సమయంలోనే పార్టీలు ఉంటాయని ఆ తర్వాత అందరు కలిసికట్టుగా పట్టణాన్ని అభివృద్ధి చేసుకోవాలని సూచన చేశారు. అనంతరం కార్యక్రమం తర్వాత వెళ్ళిపోతున్న ఎమ్మెల్యేకు కిషోర్ నమస్కారం తెలియజేశారు. వెంటనే ఎమ్మెల్యే కిషోర్‌ను దగ్గరగా తీసుకొని అపరచాణిక్యుడవు నీవు అంటూ కితాబు ఇచ్చారు. ఈ సందర్భంగా కిషోర్ నవ్వుతూ ఎమ్మెల్యేకు వినమ్రంగా దండం పెట్టారు.


ఒగ్గు కిషోర్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే శంకర్

## బూర్గులలో ఇక ప్రతి గురువారం అంగడి

**షాద్‌నగర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** అప్పట్లో 10 గ్రామాల మధ్య ఉన్న ప్రతి ఊరిలో అంగడి ఉండేది.. వివిధ గ్రామాల నుంచి ఇక్కడికి వచ్చి సంతలో సరుకులు కొని జనం ఈ అవకాశాన్ని వినియోగించుకునేవారు.. తర్వాత కాలంలో చాలా ఊళ్ళలో ఈ అంగళ్లను ఎత్తివేశారు. అందులో ఫరూక్ నగర్ మండలం బూర్గుల గ్రామం కూడా ఉంది. మూడు దశాబ్దాల క్రితం ఇక్కడ ప్రతివారం అంగడి కొనసాగేది. ప్రస్తుతం అదే సంప్రదాయాన్ని పునరుద్ధరిస్తూ గ్రామ సర్పంచ్ చిల్కమర్రి రాజగోపాల్ రెడ్డి, ఉప సర్పంచ్ శివలీల, వార్డు సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా వచ్చే నెల 5వ తేదీన "అంగడి బజారు" పేరిట గ్రామంలో సంతను ప్రారంభిస్తున్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కూరగాయలు, పండ్లు, నిత్యవసర వస్తువులు, చిన్న తరహా రైతులకు అవసరమైన వస్తువులు అందించే ఉద్దేశంతో ప్రతి గురువారం గ్రామంలో ఈ సంతను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం జర్నలిస్టు కేపీ విడుదల చేశారు. వార్డు సభ్యులు కె.కవిత, ఎం సత్యనారాయణ, కె. స్వప్న, పెద్దింటి తేజశ్రీ, పవన్ కుమార్, సంతోష్ కుమార్, హరీశ్వర్, శేఖర్, జంగమ్మ, మాజీ సర్పంచ్ పరుశురాములు, సి రాజేందర్, రాము, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.


సంత కరపత్రాలను విడుదల చేస్తున్న సర్పంచ్ తదితరులు

## క్లౌడ్ కంప్యూటర్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం ప్రారంభించిన క్లౌడ్ కంప్యూటర్ కోర్సును మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాలోని స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్లలో మైనార్టీ యువతీ,యువకులు ఈ నెల 27వ తేదీ వరకు ధరఖాస్తులు చేసుకోవాలని మేడ్చల్ జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జి.కాంతమ్మ పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ధరఖాస్తులు స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్లలో, మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఆసక్తి ఉన్న వారు ధరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు. మైనార్టీ యువత ముస్లీంలు, సిక్కులు, జైనులు, బౌద్దులుకు చెందిన వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోర్సును చేసిన వారు వివిధ ఉద్యోగ అవకాశాలు, నైపుణ్యాబివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి సంబంధిత సమాచారం కూడ పొందవచ్చన్నారు. ఆసక్తి గల యువతీ,యువకులు విద్యా అర్హత పత్రాలతో ఆయా కార్యాలయాల్లో ధరఖాస్తులు అందజేయాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్లు 9849204476, 9000168256కు సంప్రదించవచ్చని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి జి.కాంతమ్మ సూచించారు. దీనికి అర్హతలు..పదవతరగతి లేదా ఇంటర్ సర్టిఫికెట్స్, ఆదాయ దృవీకరణ పత్రం 2లక్షల వరకు ఉన్న వారు మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన వారు అర్హులని అన్నారు.

## భక్తి శ్రద్ధలతో శుక్రవారం ప్రార్థనలు

**కడ్తాల్, ఫిబ్రవరి 20, ప్రభతవార్త :** పవిత్ర రంజాన్ మాసం మొదటి శుక్రవారంను ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కడ్తాల్ మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండల కేంద్రంలోని మస్జిద్ కుబా మస్జిద్ అర్షద్ లలో మసీదు ఇమామ్ లు జహీరుద్దీన్, తహజీబ్ ఆలంల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా మసీదు కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, పాడి పంట అభివృద్ధి చెందాలని అల్లాహ్ ను ప్రార్థించారు. మసీదు కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రవూఫ్, అహ్మద్ జానీ ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



# నిరుపేదలను వంచించిన గత ప్రభుత్వం

**షాద్‌నగర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** ఇండ్లు లేని నిరుపేదలకు సొంత ఇంటి స్వప్నాన్ని సాకారం చేసి ఇందిరమ్మ రాజ్యంలో సుభిక్షంగా బ్రతకాలనే ఆలోచనలతో కాంగ్రెస్ కట్టించిన ఇందిరమ్మ గృహాన్ని లబ్ధిదారులు అట్టహాసంగా ప్రారంభిస్తున్నారు. నీడనిచ్చిన దేవుడిని ఇంటికి పిలిచి పండగ చేస్తున్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోనీ 17వ వార్డులో స్థానిక కౌన్సిలర్ నాజియా బేగం సర్వర్ పాషా ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశాన్ని లబ్ధిదారులు మంజుల బాలరాజ్ దంపతులు అట్టహాసంగా చేపట్టారు. గృహప్రవేశానికి స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ చైర్మన్ వీర్లపల్లి శంకర్ హాజరయ్యారు. స్థానిక నాయకులతో కలిసి నెహ్రూ కాలనీలోని మంజుల బాలరాజ్ దంపతులకు ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇంటి యజమానులకు తెలంగాణ సంస్కృతి సంప్రదాయ బద్ధంగా చీరసారె పెట్టి అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం నిరుపేదలను వంచిందని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గత 10 ఏళ్లలో జరిగిన లోటుపాట్లను సవరించి ప్రజలను అక్కున చేర్చుకుని వారి కష్టాలను కడతెర్చుతున్నామని అన్నారు. నియోజకవర్గంలో పలు దఫాలుగా ఇందిరమ్మ గృహాలను మంజూరు చేసి పూర్వ వైభవాన్ని సంతరించుకునేలా చేస్తానని హామీ ఇచ్చారు. రాబోయే మూడేళ్లలో అత్యధికంగా ఇందిరమ్మ ఇండ్లు కటిస్తామని అన్నారు. అదేవిధంగా పట్టణంలో మార్చి మొదటి వారంలో ఇందిరమ్మ గృహాలను కూడా లబ్ధిదారులకు అందజేస్తామని అన్నారు. పట్టణంలో ఇక కాంగ్రెస్ ప్రభుత్వం చొరవ తీసుకొని లబ్ధిదారులను పూర్తిస్థాయిలో ఆదుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగనూరు బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్, స్థానిక కౌన్సిలర్ నాజియా సర్వర్ పాషా, మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంపీపీ దేశం ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజ్ గౌడ్, పట్టణ సీనియర్ నాయకులు వావిలాల సుజీవన్, మాజీ ఎంపిటిసి తుపాకుల శేఖర్ తదితరులు హాజరయ్యారు.


మహిళకు సారెను పెడుతున్న ఎమ్మెల్యే శంకర్

## శ్రీశైల క్షేత్రానికి భక్తుల పాదయాత్ర

**కొడంగల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** నారాయణఖేడ్, సంగారెడ్డి పరిసర గ్రామాల ప్రజలు,భక్తులు గత మూడు రోజుల క్రితం ధనాసిరి మఠం నుండి బుధవారం శ్రీశైల పుణ్యక్షేత్రానికి పాదయాత్రను ప్రారంబించారు. శుక్రవారం కొడంగల్ పట్టణానికి చేరుకోవడంతో శ్రీమహాదేవుని ఆలయ ఆవరణలో విశ్రాంతి తీసుకున్నారు. హీరేమఠ్ ధనాసిరి మఠాధిపతులు శ్రీవీరేశ్వర్ శివాచార్యుల అద్వర్యంలో పాదయాత్రగా బయలుదేరినట్లు భక్తులు తెలిపారు.ప్రతి ఏడాది మహాశివరాత్రి పర్వదినం అనంతరం వచ్చే బుధవారం పాదయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు.సుమారు 8వందల మందికి పైగా పాదయాత్రగా బయలుదేరినట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీవేరేశ్వర్ శివాచార్యుల స్వామివారు భక్తులకు ప్రవచనాలు అందించారు. పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా బయలుదేరడం ఆరోగ్యంగా ఉండేందుకు అస్కారం ఉంటుందన్నారు. పాదయాత్రతో మానసిక ప్రశాంతత పొందుతూ సమస్యలు దూరమైయ్యేందుకు అస్కారం ఉంటుందన్నారు. భక్తితో ఏదైనా సాధించవచ్చని, నిర్మలమైన మనస్సుతో భగవంతుడిని ఆరాధిస్తే చింతలు దూరమవుతాయని అన్నారు. అనంతరం మండల పరిధిలోని పర్సాపూర్ గ్రామ శివారులో వెలసిన శివాలయ ఆవరణలో బస చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కన్నం రాధ శ్రీనివాస్‌రెడ్డి పాదయాత్ర చేస్తున్న భక్తులకు భోజన వసతి కల్పించగా అక్కడే భక్తులు భజనలు చేస్తు దేవదేవుడిని నామస్మరణ చేపట్టారు.ప్రతి రోజు 40 కిలోమీటర్ల మేర పాదయాత్ర కొనసాగిస్తు 15 రోజుల్లో శ్రీశైలం పుణ్యక్షేత్రానికి చేరుకోవడం జరుగుతుందన్నారు.


భక్తులకు ప్రవచనాలు బోధిస్తున్న మఠాధిపతి

# భవిష్యత్ సవాళ్లను ఎదుర్కోవటానికి సిఎంఎ దోహదం

**శామీర్‌పేట, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** సీఎంఏ వృత్తిని సంస్థాగతంగా పనితీరును మెరుగుపర్చటంలో, దేశ నిర్మాణ మౌలిక సదుపాయాలు బలోపేతం చేయటంలో ఇంటిగ్రేటెడ్ కాస్ట్ లీడర్‌షిప్ అమలు, డేటా ఆధారిత నిర్ణయాలు తీసుకోవటం అత్యంత కీలకమని ఎన్వీసీ చైర్మన్, ఐసిఎంఏఐ మాజీ అధ్యక్షులు సిఎంఏ డాక్టర్ ఏఎస్ దుర్గాప్రసాద్ అన్నారు. శుక్రవారం శామీర్‌పేట మండలంలోని లియోనియా రిసార్ట్సులో ది ఇన్స్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియా (ఐసిఎంఏఐ), ప్రతిష్టాత్మక రీజినల్ కాస్ట్ అండ్ మేనేజ్‌మెంట్ అకౌంట్స్ కన్వెన్షన్ (ఆర్‌సిఎంఏసి-2026)ను నిర్వహించారు. ది ఇన్స్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంట్స్ ఆఫ్ ఇండియాకు చెందిన సదరన్ ఇండియా రీజనల్ కౌన్సిల్ (ఎస్ఐఆర్‌సి) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఐసిఎంఏఐ ప్రాంతీయ సదస్సును ఆయన విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగ ఎన్వీసీ చైర్మన్, ఐసిఎంఏఐ మాజీ అధ్యక్షులు సిఎంఏ డాక్టర్ ఏఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మారుతున్న ప్రపంచ ఆర్థిక ముఖ చిత్రానికి అనుగుణంగా సిఎంఏ వృత్తిని పునర్నిర్వహించటం స్థిరమైన విలువను, వ్యూహాత్మక ప్రభావాన్ని పెంపొందించటం అనే లక్ష్యంతో దేశ విదేశాల నుంచి సుమారు 500 మంది వరకు ప్రతినిధులు పాల్గొనటం ప్రశంసనీయమన్నారు. పరిశ్రమల అధిపతులు, విద్యావేత్తలు, విధానకర్తలు, సిఎంఏ నిపుణులు పాల్గొంటున్నట్లు, పనితీరులో అత్యున్నత ప్రమాణాలు , బాధ్యతాయుతమైన వృద్ధి, భవిషత్ సవాళ్లను ఎదుర్కొనే లక్షణాలు పెంపొందించటంలో సిఎంఏ పాత్రను బలోపేతం చేయటంపై ఈ సదస్సు దృష్టి సారించటం ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. సిఎంఏ టిసిపి శ్రీనివాస్ ప్రసాద్ మాట్లాడుతూ వ్యూహాత్మక వ్యాపార భాగస్వాములుగా సిఎంఏ పాత్రమారుతుందన్నారు. ఈఎస్‌జి పర్యావరణం, సామాజిక, పాలన గవర్నెన్స్, వాల్యు ఇంజనీరింగ్ వంటి కీలక రంగాలలో నిపుణులు నాయకత్వం వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐఆర్సీ చైర్మన్ సిఎంఏ విజయ్ కిరణ్ ఆగస్త్య, ఐసిఎంఏఐ సెంట్రల్ కౌన్సిల్ సభ్యులు సిఎంఏ డాక్టర్ కెఎస్‌హెచ్ ఏవి ఎస్ఎస్ మూర్తి, ఎస్ఐఆర్‌సి ట్రెజరర్ సిఎంఏ కేవిఎస్ లావణ్య, సిఎంఏ ఖాజా జలాల్ ఉద్దీన్, మాజీ అధ్యక్షులు సిఎంఏ ఏఎన్ రామన్, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


ఐసిఎంఏఐ ప్రాంతీయ సదస్సును ప్రారంభిస్తున్న ఎన్వీసీ చైర్మన్ దుర్గాప్రసాద్

# పేదల కళ్లల్లో సంతోషం నింపిన ఘనత కాంగ్రెస్‌దే

**మేడ్చల్, ఫిబ్రవరి 20. ప్రభాతవార్త :** నిరుపేదల స్వంతింటి కలను సాకారం చేస్తున్న ఘనత తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్ అన్నారు. గుండ్లపోచంపల్లి డివిజన్‌లోని నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశ పూజా కార్యక్రమంలో వజ్రేష్ యాదవ్ పాల్గొని ఇంటి ప్రవేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల ప్రజల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తున్నదని, సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో ప్రజా పాలన కొనసాగిస్తూ పేదల స్వంతింటి కలను రాష్ట్ర ప్రభుత్వం నెరవేరుస్తున్నదని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరి అవుతుందన్నారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్న ప్రజలు సంతోషంతో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి హరివర్ధన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. మేడ్చల్ పట్టణంలో ఇందిరమ్మ ఇల్లును కట్టుకున్న మక్కల యశోద ఇంటి గృహప్రవేశాన్ని కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శివ శంకర్ ముదిరాజ్, సత్యనారాయణ, చీర్ల రమేస్, చాపరాజు, కొడె మహేష్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.


గుండ్లపోచంపల్లిలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభిస్తున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వజ్రేష్ యాదవ్

# శాఖా గ్రంథాలయాలలో డిజిటల్ సదుపాయాలు

**జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాలోని శాఖ గ్రంథాలయాలను బలోపేతం చేయాలని, డిజిటల్ సదుపాయాలను విస్తరించాలని, పాఠకులకు ఆధునిక వసతుల కల్పనకు ఈ సర్వసభ్య సమావేశంలో ప్రతిపాదనలు చేసినట్లు మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. వాటితో పాటు గ్రంథాలయాలకు పుస్తకాలు, పత్రికల కొనుగోలు పలు అంశాలపై చర్చించి, అదే విధంగా అంఛనా బడ్జెట్ చేసి ఆ ప్రతిపాదనలకు ఆమోదించినట్లు తెలిపారు. శుక్రవారం మేడ్చల్‌లోని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో జిల్లా చైర్మన్ బి.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. అదే విధంగా 2026-2027వార్షిక ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ అంచనాలను సమావేశంలో ఆమోదించినట్లు, చేసిన ప్రతిపాదనలను రాష్ట్ర గ్రంథాలయ పరిషత్‌కు పంపాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో గ్రంథాలయ అభివృద్ధి ద్వారా పాఠకులకు మెరుగైన సేవలను అందించటమే లక్ష్యంగా సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా అధికార ప్రతినిధి, వయోజన విద్య అధికారి, జిల్లా పౌరసంబంధాల అధికారి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పేరం సురేశ్‌బాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సెక్రటరీ పి.సురేశ్‌బాబు తదితరులు

# డ్రెయినేజీ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 20 ప్రభాతవార్త:** పద్మారావు నగర్ లోని గాంధీ ఆస్పత్రి వెనుక వైపు మెయిన్ రోడ్ లో 42 లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేయను న్న డ్రైనేజీ పైప్లైన్ పనులకు అడ్డంకులు తొలగిపోయాయి. కొద్దిరోజుల క్రితం రాష్ట్ర మాజీ మంత్రి సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇక్కడ డ్రైనేజీ పైప్లైన్ పనులను ప్రారంభించారు. అయితే భూగర్భ విద్యుత్ కేబుల్ వ్యవస్థ ఉండడంతో పనులను మొదలు పెట్టడానికి జాప్యం నెలకొన్నది. దీంతో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు జలమండలి, విద్యుత్ శాఖ, జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు, బిఆర్ఎస్ ఇంచార్జి జీ పవన్ కుమార్ గౌడ్ శుక్రవారం సమస్య ఉన్న ప్రాంతాన్ని సందర్శించారు. డ్రైనేజీ పైపులు వేయాలంటే, ముందుగా గాంధీ ఆసుపత్రికి 33 కేవీ విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి వస్తుందని, అందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతూ జలమండలి జీఎం వినోద్‌కుమార్, విద్యుత్ శాఖ డీఈ బ్రహ్మానందంకు వినతి పత్రం అందజేశారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని తప్పకుండా సహకరిస్తామని విద్యుత్ శాఖ బ్రహ్మానందం హామీ ఇచ్చారు.

**రాజకీయ దురుద్దేశంతో ఆరోపణలు సరికాదు**

పవన్ కుమార్ గౌడ్‌విద్యుత్ శాఖ, జలమండలి, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో ఎట్టకేలకు సమస్య ఒక కొలి క్కి వచ్చిందని పవన్ కుమార్ గౌడ్ తెలిపారు. ఇందుకోసం తాము ప్రతిరోజూ ఉన్నతాధికారులతో చర్చిస్తూనే ఉన్నామని తెలిపారు.


మున్సిపల్ చైర్మన్ వైస్ చైర్మన్‌లను సన్మానిస్తున్న న్యాయవాది కంచి రాజగోపాల్

## చైర్మన్ వైస్‌చైర్మన్‌లకు సత్కారం

**షాద్‌నగర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్‌గా అగ్గనూరు బస్వం, వైస్ చైర్మన్ అందెమోహన్‌లకు షాద్ నగర్ ప్రముఖ సీనియర్ న్యాయవాది కంచి రాజగోపాల్, మాజీ కౌన్సిలర్ వెంకటారామ్రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలుసుకొని శుభాభినందనలు తెలియజేశారు. శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ఇరువురు ప్రజాప్రతినిధులను కలుసుకొని వారినీ ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరింత అభివృద్ధి సాధించాలని వారు ఆకాంక్షి ంచారు.


విజయనిర్మల జయంతి వేడుకల్లో పాల్గొన్న ఖాదర్ గోరి

## విజయనిర్మలకు నివాళి

**షాద్‌నగర్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లో జరిగిన విజయనిర్మల జయంతి వేడుకల్లో పాల్గొని నివాళులర్పించిన ఆల్ ఇండియా కృష్ణా మహేష్ ప్రజాసేన జాతీయ అధ్యక్షులు ఖాదర్ గోరి కొత్తపేట ఉస్మాన్ నిర్మాత సిరాజ్ పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.


విద్యార్థులకు నిత్యావసర సరకులను అందజేసిన ఐక్లీన్ కంపనీ వైస్ ప్రసిడెంట్ శ్రీకాంత్

## విద్యార్థులకు నిత్యావసర సరకుల పంపిణీ

**మేడ్చల్, ఫిబ్రవరి 20. ప్రభాతవార్త :** పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం దాతల సహకారం ఎంతో అభినందనీయమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం స్థానిక ఐక్లీన్ కంపనీ ఆధ్వర్యంలో బియ్యం, పప్పు. నూనె, ఉప్పు తదితర నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం సమాజంలో ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఐక్లీన్ కంపనీ అందించిన సహకారం విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్లీన్ కంపనీ వైస్ ప్రసిడెంట్ శ్రీకాంత్, గుండ్లపోచంపల్లి డివిజన్ బీజేపీ అధ్యక్షుడు శ్రీధర్, నాయకులు అశోక్, రామారావు, మధు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


ఎంపి ఈటల రాజేందర్‌ను కలిసిన ఎల్లంపేట మున్సిపల్ శ్రీదేవి

## ఎల్లంపేట చైర్మన్‌కు ఎంపి ఈటల సత్కారం

**మేడ్చల్, ఫిబ్రవరి 20. ప్రభాతవార్త :** ఎల్లంపేట మున్సిపల్ చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన లావుడియా శ్రీదేవి శుక్రవారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చైర్మన్‌కు ఎంపీ ఈటల శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు విక్రంరెడ్డి, ఇరు పార్టీల నాయకులు నందారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజమల్లారెడ్డి, వెంకటేష్, మల్లికార్జున్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.


ఆలయానికి భారీగా తరలివచ్చిన భక్తులు

## పోలేపల్లి ఎల్లమ్మ ఆలయం కిటకిట

**దుద్యాల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయం శుక్రవారం భక్తులతో కిటకిటలాడింది. ఈ నెల 12 నుండి నాలుగు రోజులపాటు అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన తర్వాత కూడా శుక్రవారం భక్తులు వేల సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక బోనాలు, కోడిపుంజులు, మేకపోతుల ు సమర్పించి భక్తులు మొక్కులు చెల్లించు కుంటున్నారు. దేవాలయం పరిసర ప్రాంతం ఎటు చూసినా భక్తుల కోలాహాలంతో నిండి జాతర ను తలపిస్తుంది.


సమావేశంలో మాట్లాడుతున్న గౌరారం గోపాల్

## ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

**దుద్యాల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** బొంరాస్ పేట్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన మొదటి రోజు కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయుల పలు సమస్యలపై యుటిఎఫ్ మండల అధ్యక్షులు గౌరారం గోపాల్ ప్రస్తావించారు. విద్యా సంవత్సరం ముగింపు దశలో ఉన్నందువలన పాఠశాలల మధ్యాహ్న భోజన నిర్వాహకుల పెండింగ్ బకాయిల ు సంబంధిత శాఖల అధికారులతో చర్చించి వీలైనంత త్వరలో చెల్లించాలని కోరారు. గత అకాడమిక్ ఇయర్ 2024-25 ఎంపీ ఎలక్షన్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయుల వారి అటెండెన్స్ ప్రకారం అర్హతలు ఉన్న వారందరికీ సంపాదిత సెలవులు, ఈయల్స్ ఉత్తర్వులు మంజూరు చేయాలన్నారు. 2025-26 సంవత్సరంలో నిర్వహించిన స్థానిక సంస్థల పంచాయతీ ఎన్నికలలో శని, ఆదివారాలలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులందరికీ జిల్లా అధికారుల ు సంప్రదించి సిసిఎల్స్ ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.



బోగ్ పూజలో పాల్గొన్న బాబుసింగ్ మహరాజ్

## బంజారాల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ. వెయ్యి కోట్లు

### పొరాదేవి పీఠాధిపతి బాబుసింగ్ మహరాజ్ విజ్ఞప్తి

**పెద్దేముల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్ మహరాజ్ అని, ఆయన చరిత్రను పాఠ్య పుస్తకాలలో చేర్పించే విధంగా ప్రభుత్వం కృషి చేయాలని పొరాదేవి పీఠాధిపతి (మహరాష్ట్ర) బాబుసింగ్ మహరాజ్ అన్నారు. సంత్ సేవాలాల్ మహరాజ్ అవతార మహోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం పెద్దేముల్ మండలం కందనెల్లితాండా సమీపంలోని యాడిబాపుగడ్ అధ్యాత్మిక కేంద్రంలో నిర్వహించిన బోగ్ పూజ కార్యక్రమానికి పీఠాధిపతి బాబుసింగ్ మహరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంజారాల కోసం ప్రత్యేక ఎండోమెంట్ శాఖను కేటాయించేలా చూడాలని అన్నారు. బంజారాల అభివృద్ధి సంక్షేమం కోసం బడ్జెట్‌లో ప్రతి యేటా రూ. వెయ్యి కోట్లు కేటాయించాలని అన్నారు. యాడిబాపుగడ్ వ్యవస్థాపకులు రామవత్ శాంతాదేవి, రామావత్ సురేందర్ నాయక్ మాట్లాడుతూ బంజారాలను చైతన్యపరిచేందుకు ప్రభుత్వం కృషిచేయాలని అన్నారు. బంజారాల సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడవలసిన అవసరం ఉందని అన్నారు. బంజారా భవనాన్ని కొందరు రాజకీయ వేదికగా ఏర్పాటు చేసుకోవడం భాదకరమని అన్నారు. ఈ అధ్యాత్మిక కేంద్రంలో పాఠశాలను, అనాథ ఆశ్రమ ఏర్పాటుకు తమవంతు కృషిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ యంపిపి మధులత శ్రీనివాస్‌చారీ, భువనగిరి మాజీ సర్పంచ్ పాండు నాయక్, గౌడి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి తీర్మానం

**తలకొండపల్లి, ఫిబ్రవరి20, ప్రభాతవార్త;** తలకొండపల్లి మండల పరిధిలోని చంద్రధన గ్రామపంచాయతీలో గ్రామసభ సర్పంచ్ సొల్లు రంగమ్మ అధ్యక్షతన నిర్వహించరు. శుక్రవారం నాడు పంచాయతీ కార్యాలయంలోగ్రామంలో ఉన్నటువంటి సమస్యలు మరియు గ్రామ అభివృద్ధి కొరకై శ్రీకారం చుట్టడానికి పాలకవర్గం వార్డు మెంబర్లు మరియు గ్రామ పెద్దలు ప్రజలందరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్నటువంటి సమస్యలను పరిష్కరిస్తానని గ్రామ అభివృద్ధికి అందరూ కలసికట్టుగా ముందుకు సాగాలని నిర్ణయించామన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య, వీధిలైట్లు, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తూ గ్రామాన్ని ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సొల్లు రంగమ్మ, ఉప సర్పంచ్ ఎన్నెడ్ల రవీందర్ రెడ్డి, గ్రామ సెక్రెటరీ ప్రవీణ్ రెడ్డి, వార్డు సభ్యులు, బిశివీ నరసింహ, గ్రామ వ్యవసాయ అధికారి శ్రీనాథ్ రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ మంగమ్మ, పల్లె దుకాణ డాక్టర్ నందిని, ఆశ వర్కర్లు, గ్రామ పెద్దలు, యువకులు మరియు వివిధ సంఘాల నాయకులు గ్రామ ప్రజలు పాలొన్నారు.



డ్రెయినేజీ పనులు గుర్తిస్తున్న సర్పంచ్ అనురాధకిషన్‌రెడ్డి

## సమన్వయంతో పని చేద్దాం

### కొల్కులపల్లి పంచాయతీ బోర్డు తీర్మానం

**మాడ్గుల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** మండలంలోని కొల్కులపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో సాధారణ సమావేశం సర్పంచ్ భట్టు అనురాధ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన, పారిశుధ్య సమస్యలపై విస్తృతంగా చర్చించారు. సమావేశానికి ఉప సర్పంచ్ రెడ్డమోని అలివేలు, వార్డు సభ్యులు మోగతాల దేవేందర్, ఏణుక శ్రీశైలం, మేరావత్ సంతోష్, పుల్లమల్ల అలివేలు, బుర్రి మహేశ్వరి, పంచాయతీ సెక్రెటరీ నవీన్ పాల్గొన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు సమన్వయంతో పని చేయాలని సభ్యులు సూచించారు. సమావేశం అనంతరం సర్పంచ్‌తో కలిసి వార్డు సభ్యులు గ్రామంలో పర్యటించి, కొత్తగా డ్రైనేజీ పనులు చేపట్టాల్సిన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కారింగ వెంకటేష్, శవ్వ శ్రీశైలం గల్లీలో నూతనంగా అండర్ డ్రైనేజీ నిర్మాణం చేపడతామని, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. గ్రామంలో పారిశుధ్య సమస్యలు తీరేలా, ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా పంచాయతీ పాలకవర్గం ముందుకు సాగుతుందని సర్పంచ్ తెలిపారు.

## చేవెళ్ల పుష్కరిణిలో గుర్తుతెలియని మృతదేహం

**చేవెళ్ల, జనవరి 20, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని శ్రీ లక్ష్మీ మ్మ వెంకటేశ్వర దేవాలయం ఆవరణలోని పుష్కరిణిలో గుర్తు తెలియని వ్యక్తి శవమై కనిపించాడు. ఈ సంఘటన శుక్రవారం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పుష్కరిణిలో మృతదేహం తేలుతుండడానికి గమనించిన భక్తులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. వ్యక్తి మృతి అనుమానాస్పదంగా ఉండడంతో ఆనవాళ్లను గుర్తించేందుకు క్లూస్ టీంను రప్పించారు. గుర్తు తెలియని వ్యక్తులు కర్రలతో విచక్షణారహితంగా కొట్టి చంపినట్లు పోలీసులు నిర్ధారించారు. ఇది ముమ్మాటికి హత్యేనని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు.

హత్య చేసిన అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు మృతదేహాన్ని దేవాలయం ఆవరణలోని పుష్కరిణిలో పడవేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి మెడలో వెండి గొలుసు తో పాటు చేతికి కడియం, పచ్చబొట్టుతో చేయి పై రాములు అనే పేరు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మృతుడి వివరాల కోసం పోలీసులు ఆరా తీస్తున్నారు. పట్టణ కేంద్రంలో పలు సిసి కెమెరాలను పరిశీలించి కేసును ఛేదిస్తామని చేవెళ్ల సిఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని తెలిపారు. మృతుడికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియాల్సి ఉందన్నారు.

# ఎట్టకేలకు చీకటి తెరలకు చెల్లుచీటీ

### గ్రామాల్లో వీధి లైట్లపై సర్పంచ్‌ల దృష్టి

### విద్యుత్ కాంతులతో స్థానికుల సంబరం

**నందిగామ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** స్పెషల్ అధికారుల హయాంలో గ్రామాభివృద్ధికి పట్టిన గ్రహణం వీడుతోంది. పంచాయతీ ఎన్నికల అనంతరం వచ్చిన కొత్త పాలకవర్గాలు ప్రజా సమస్యలపై దృష్టి పెడుతున్నాయి. వీధి లైట్లకు కూడా దిక్కులేక గతంలో పలు వీధుల్లో అంధకారం రాజ్యమేలేది. దీంతో రాత్రి వేళల్లో స్థానికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యే వాళ్లు. చిమ్మ చీకటిలో రాకపోకలు బిక్కుబిక్కు మంటూ చేయాల్సిన పరిస్థితి ఉండేది. ఈ సమస్యపై గతంలో పట్టించుకునే నాధుడు ఉండేవాడు కాదు. ఎన్నికల అనంతరం సర్పంచ్ కొమ్ము కృష్ణ నేతృత్వంలో ప్రాధాన్యత క్రమంగా ప్రజల అత్యవసరాలపై దృష్టి పెట్టారు. పంచాయతీ పరిధిలో 14 మొత్తం వార్డులు ఉండగా 140 వరకూ వీధి లైట్లు ఉన్నాయి. గతంలో 30 ఓల్టేజి పవర్‌తో ఉన్న విద్యుత్ దీపాలు ఉండేవి. అవి మినకు మినుకు మంటూ కనిపించేవి. ఆ స్థానంలో 50 ఓల్టేజి సామర్థ్యం ఉన్న దీపాలను ఏర్పాటు చేస్తున్నారు. దాదాపు 2 లక్షల రూపాయలు ఖర్చు చేసి గ్రామం మొత్తం కొత్త లైట్లు ఏర్పాటు చేస్తున్నామని సర్పంచ్ చెప్పారు. ఇందులో భాగంగా శుక్రవారం 7వ వార్డులో వార్డు మెంబరు శివగల్ల సురేష్ ఆధ్వర్యంలో కొత్త వీధి లైట్లు ఏర్పాటు చేయటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వార్డు సభ్యుడు శివగళ్ల సురేష్ మాట్లాడుతూ కాలనీలో వీధిలైట్ల బిగింపుతో పాటు పరిసరాల పరిశుభ్రతకు పెద్దపీట వేస్తున్నా మన్నారు. షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అండదండలతో సర్పంచ్ కొమ్ము కృష్ణ ప్రోద్భలంతో వార్డ్‌లో మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా పెట్టుకు న్నామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ అగ్గి ప్రసాద్, నాయకులు అగ్గి శ్రీశైలం, జాన్, పారిశుధ్య సిబ్బంది శంషాద్దీన్, గ్రామస్తులు తదితరులున్నారు.



పటేల్ చెరువు తండాలో వీధి దీపాలు ఏర్పాటుచేస్తున్న దృశ్యం



నందిగామ ఏడవ వార్డులో వీధిలైట్లు బిగిస్తున్న వార్డు సభ్యుడు శివగళ్ళ సురేష్

### అన్ని రంగాల్లోనూ గ్రామాభివృద్ధే లక్ష్యం

**కుల్కచర్ల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** గ్రామాని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని సర్పంచ్ శాంతి తులసి రామ్ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పటేల్ చెరువు తండా గ్రామ పంచాయతీలోని వీధిదీపాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..పటేల్ చెరువు తండా గ్రామ పంచాయతీ తాండలకు తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతునట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతం కృషి చేస్తాన్నారు. పెడింగ్‌లో ఉన్న పనులను దశల వారిగా అన్నీ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో కారోబర్ రాములు నాయక్ పాల్గొన్నారు.

## మాది చేతల ప్రభుత్వం: ఎమ్మెల్యే

**నందిగామ, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజా పాలనలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. శుక్రవారం నందిగామ మండలం అంతిరెడ్డి గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని జంగోనిగూడలో జంగ లావణ్య, లలితలకు చెందిన ఇందిరమ్మ ఇళ్లకు గృహ ప్రవేశం చేసి వారికి చీర సారే పెట్టారు. అదే గ్రామానికి చెందిన మల్లమ్మకు చెందిన ఇందిరమ్మ ఇంటికి భూమి పూజ చేశారు. నూతన ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ శిలాఫలకాలతోనే సరిపెట్టుకుందని ధ్వజమెత్తారు. మాది మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమన్నారు. అరులైన ప్రతి ఒక్కరికి ఇళ్లను వర్తింప చేస్తామని బరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎం శివ శంకర్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు, సర్పంచులు కొమ్ము కృష్ణ, సి మల్లేష్, మంకాల శ్రీశైలం, మాజీ ఎంపిటిసిలు కుమార్ గౌడ్, చంద్రపాల్ రెడ్డి, నాయకులు మాజీ సర్పంచ్‌లు కావలి కృష్ణ, బుయ్యని వీరేందర్ గౌడ్, వార్డు సభ్యులు అంజి యాదవ్, గట్టుపల్లి యాదయ్య, బాల్ రాజ్, రమేష్, వెంకటేష్, చిందం నర్సింలు, విగ్నేష్ రెడ్డి, శ్రీశైలం గౌడ్, తదితరులున్నారు.



జంగొనిగూడెంలో ఇందిరమ్మ లబ్ధిదారుకు చీరసారె పెడుతున్న ఎమ్మెల్యే శంకర్

## పేదల సొంతింటి కల సాకారం

**కుల్కచర్ల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సాకారం అవుతుందని డిసిసి జిల్లా ఉపాధ్యక్షులు భీంరెడ్డి, మార్కెట్ కమిటి ఛైర్మన్ బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. మండల పరిధిలోని కుసుమసముద్రం గ్రామంలో ద్యాగ తిరుపతయ్యకు ఇందిరమ్మ ఇల్లు మంజురు కావడంతో నిర్మాణం పూర్తి చేసుకుని శుక్రవారం గృహ ప్రవేశంలో స్థానిక నాయకుతలో కలిసి పాల్గొని ద్యాగ తిరుపతయ్యకు దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటి ఛైర్మన్ బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్లు చేపట్టిన పథకం ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం పూర్తికావడం లబ్దిదారులు నూతన గృహప్రవేశం చేయడం ఎంతో సంతోషంగా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో రాంపూర్ సర్పంచ్ తిరుపతయ్య, యువ నాయకులు కుమ్మరి స్వామి, వెంకటయ్య గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో పాలొన్న నేతలు

## గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తా : ఎమ్మెల్యే కసిరెడ్డి

**కడ్తాల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** ఇందిరమ్మ రాజ్యంలో పేదవారికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. పేద వాడి సొంత ఇంటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్మమని అన్నారు. శుక్రవారం కడ్తాల్ మండలం మైసిగండి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారా యణరెడ్డి హాజరయ్యారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొం తింటి కల సహకారం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ అభివృద్ధికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు అయిళ్ళ శ్రీనివాస్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ యట గీత నరసింహ, సర్పంచ్ ప్రేమ జవహర్ లాల్, ఉపసర్పంచ్ హిరా సింగ్, యాదగిరి రెడ్డి, మాజీ సర్పంచ్ తులసి రామ్ నాయక్, గ్రామ పంచాయతీ కార్యదర్శి,సభ్యులు, ప్రజాప్రతినిధులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశంలో పాలొన్న ఎమ్మెల్యే

## ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కాంగ్రెస్ నైజం

**పెద్దేముల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే భాధ్యత ప్రజా ప్రభుత్వానిదేనని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండలం కందనెల్లి గ్రామంలోని బోయిని సుక్కమ్మ మొగులప్ప నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కాంగ్రెస్‌పార్టీ నైజమని అన్నారు. ప్రజాసంక్షేమం, అభివృద్ధే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాదమ్మ, తాండూరు మునిసిపల్ చైర్‌పర్సన్ నీరజా బాల్‌రెడ్డి, మాజీ వైస్ యంపిపి మధులత శ్రీనివాస్‌చారీ, సీనియర్ నాయకులు కిరన్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

## నేడు మోడల్ సోలార్ విలేజ్ అవగాహన సదస్సు

**కొడంగల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం అద్వర్యంలో అమలవుతున్న మోడల్ సోలార్ విలేజ్ పథకంపై కొడంగల్ మండలంలోని అన్ని గ్రామాలతో పాటు మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డులలో అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పథకంపై శనివారం పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్‌హాల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. అవగాహన కార్యక్రమానికి తెలంగాణా రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూక్, టీజీ రెడ్కో వైస్ చైర్మన్ మేనేజింగ్ డెరెక్టర్ అనిలా, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, డిస్కం, టీజీ రెడ్కో సీనియర్ అధికారులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఇందుకుగాను మండలంలోని అన్ని గ్రామాల ప్రజలతో పాటు మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల ప్రజలు ఈ అవగహన కార్యక్రమంలో పాల్గొని పథకం ప్రయోజనాలను తెలుసుకోవాలని కోరారు.



ఇళ్ల పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

## రెండు నెలల్లో డబుల్ బెడ్ రూం ఇళ్లు

**తాండూరు, జనవరి 20, ప్రభాతవార్త :** అర్హులైన నిరుపేదల సొంతింటి కల నెరవేరబోతోందని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. వచ్చే రెండు నెలల్లో పనులు పూర్తి చేసి పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు పంపిణీ చేయటానికి కృషి చేస్తున్నామన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి తాండూరు పట్టణ శివారు హైదరాబాద్ రోడ్డు మార్గంలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇళ్లను పరిశీలించారు. ప్రస్తుతం ఎన్ని ఇండ్లు నిర్మాణం పూర్తి అయ్యాయి.. ఏయే దశలో నిర్మాణంలో ఉన్నాయి అని ఆరా తీశారు. రోడ్లు, మౌళిక సదుపాయాలపై ఆశాఖ అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజా, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ డిపిసి సభ్యులు పట్లోళ్ల నర్సింలు, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, పార్టీ నేతలు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

## మాతా శిశు ఆసుపత్రిలో మెరుగైన సేవలుండాలి

**తాండూరు, జనవరి 20, ప్రభాతవార్త :** మాతాశిశు ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించేందుకు దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తాండూరు పట్టణ శివారు హైదరాబాద్‌రోడ్డు మార్గంలోని మాతా శిశు ఆసుపత్రిని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో వివిద వార్డులను పరిశీలించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆసుపత్రిలో ఉన్న సమస్యలు, ఎదురవుతున్న ఇబ్బందులను వైద్యులు, సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మాతా శిశు ఆసుపత్రిలో సమస్యల పరిష్కారానికి, మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కృషి చేస్తామని అన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిచేలా దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజా, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాల్‌రెడ్డి, మాజీ డిపిసి సభ్యులు పట్లోళ్ల నర్సింలు, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, పార్టీ నేతలు, వివిద శాఖల అధికారులు, వైద్యులు, సిబ్బంది ఉన్నారు.



ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

## పత్తి విత్తుకు యాంత్రీకరణ పద్ధతి మేలు

**పూడూరు, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుకు తేలికపాటి నేలలు ఎంతో అనుకూలమని రైతు విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త బి రాజామధు శేఖర్ అన్నారు. శుక్రవారం పూడూరు మండలం పరిధిలోని మంచన్‌పల్లి రైతువేదికలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వ విద్యాలయం, తెలంగాణ రైతు విజ్ఞానకేంద్రం వికారాబాద్ అధ్వర్యంలో సెంట్రల్ ఇనిస్ట్యూట్ ఆఫ్ కాటన్ రీసెర్చ్‌వారి ప్రత్యేక ప్రాజెక్ట్‌లో భాగంగా అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిపంట సాగులో కూలీల కొరత తీవ్రంగా ఉన్నందున అధికసాంద్రత యాంత్రీకరణ పద్ధతిలో పత్తిని విత్తుకోవాలని సూచించారు. తెలంగాణ రైతు విజ్ఞానకేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ టి రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అధికసాంద్రత పద్ధతిలో ఆశించే వేరుకుళ్లు తెగులు, ఎండుతెగులు, తలమాడు, వివిధ ఆకు మచ్చరకాల తెగుళ్ల లక్షణాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. పరిగి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మీకుమారి మాట్లాడుతూ రైతులు సాగుచేసే పంటలను వ్యవసాయ విస్తరణ అధికారి చేత తప్పకుండా నమోదు చేయించుకోవాలని సూచించారు. ఆత్మా చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రసాయనాల వాడకాన్ని తగ్గించి నేల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాఘవేందర్, వ్యవసాయ విస్తరణ అధికారులు మహిపాల్, రాజ్‌కుమార్, శివ, యువ ప్రొఫెషనల్స్ సల్మాన్ కేశవక్రిష్ణ, కీర్తనరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పత్తిపంటపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

## ఇల్లు రాలేదని నిరాశ వద్దు..రెండో విడత ఉంది

**యాచారం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** అర్హులైన నిరుపేదలకే సంక్షేమ పథకాలు అమలు జరుగుతుందని చెప్పడానికి ఇందిరమ్మ పథకమే నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ మండల జనరల్ సెక్రెటరీ ముచ్చర్ల సంపత్ కుమార్, మాజీ ఎంపీటీసీ మోటి శ్రీశైలం అన్నారు. శుక్రవారం యాచారం మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి గ్రామంలో మొరుగు లలిత మధుకర్ ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవానికి హాజరై దంపతులను ఆశీర్వదించారు. తెలంగాణ రాష్ట్రంలో 15 ఏళ్ల తర్వాత నిరుపేదలకు పక్కా ఇంటి నిర్మాణం జరుగుతోందన్నారు. రెండో విడత కూడా అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయన్నారు. ఎవరు నిరాశ చెంద రాదని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ మాయలోనే ఆసలైన అర్హులకే వందల మందికి సంక్షేమ పథకం అందుతాయి అన్నారు.



ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు



నూతన బోరు మోటర్‌ను ఏర్పాటు చేయిస్తున్న సర్పంచ్

## చెంచుకాలనిలో తాగునీటి సమస్య పరిష్కారం

**కుల్కచర్ల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తిసుకుంటామని సర్పంచ్ నరసిహులు యాదవ్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని రాంరెడ్డిపల్లి గ్రామంలోని చెంచుకాలనిలో తాగునీటి సమస్య ఉందని వెంటనే నూతన బోరు మోటర్ ఏర్పాటు చేశారు. వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తిసుకుంటున్నట్లు తెలిపారు.

## నచ్చిన పని చేసుకుంటూ బతకండి

**కడ్తాల్, ఫిబ్రవరి 20, ప్రభావార్త :** నిరుద్యోగ యువతీ యువకులు తమకు నచ్చిన స్వయం ఉపాధి రంగాలను ఎంచుకొని రాణించాలని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన చందు కొనుగోలు చేసిన వరి కోత మిషన్‌ను వెంకటేష్ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత స్వయం కృషితో ఎదగాలని దృఢ నిశ్చయంతో ముందుకు సాగాలన్నారు. ప్రస్తుతం సమా జంలో చెడు వ్యసనాలకు బానిస కాకుండా మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నారు. అనంతరం శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో చందు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



వరి కోత మిషన్‌ను ప్రారంభిస్తున్న సింగల్ విండో చైర్మన్

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

**కుల్కచర్ల, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త:** ఓ ఎలక్ట్రిక్ స్కూటి, కారు ఢీకొని ఎలక్ట్రిక్ స్కూటి నడుపున్న వ్యక్తికి గాయాలైన సంఘటన ముజాహిద్‌పూర్ గేట్ సమిపంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం .. రాం సింగ్ నాయక్ తాండకు చెందిన రాము ఎలక్ట్రిక్ స్కూటి పై కుల్కచర్ల నుండి రాంసింగ్ నాయక్ తాండ వైపు వేళ్తున్నాడు. పరిగి నుండి కుల్కచర్ల వైపు జడ్చర్ల కు చెందిన స్విఫ్ట్ డిజైర్ కారు వెళ్తున్న ఈ క్రమంలో ముజాహిద్‌పూర్ గేట్ సమిపంలో హనుమాన్ దేవాలయం దగ్గర ఎలక్ట్రిక్ స్కూటి, కారు ఢీ కొన్నాయి. ఎలక్ట్రిక్ స్కూటి పై ఉన్న వ్యక్తికి గాయాలు కవడంతో వెంటనే 108 వాహనంలో పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థాలానికి చేరుకొని ఢీ కొన్న వాహానాలను పోలీస్‌స్టేషకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఢీ కొట్టుకున్న స్కూటీ, కారు



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కౌన్సిలర్ వాణిశ్రీ

## పనుల్లో నాణ్యతాలోపం రాకూడదు

**కొడంగల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** కొడంగల్ మున్సిపల్ పరిధిలోని 2వ వార్డులో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని మున్సిపల్ కౌన్సిలర్ వాణీశ్రీ మధుసు దన్‌యాదవ్ కోరారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలో శ్మశాన వాటిక పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా చేపడుతున్న పనులకు సంభందించి సంభందిత కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. శ్మశాన వాటికలో గదుల నిర్మాణం, వాటర్‌షెడ్, మరుగుదొడ్లు తదితర పనులలో నాణ్యతా లోపం జరుగకుండా జాగ్రత్తగా పరిశీలించి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

## అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తాం

**కొడంగల్, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే పేదల సొంత ఇంటి కల సాకారం అవుతుందని మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 2వ వార్డులోని ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు చింతకాయల మొగులమ్మ గృహప్రవేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నిజం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఊట్కూర్ శ్రీనివాస్‌రావు, పి.మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్

## పంచాయతీ కార్యదర్శుల క్యాలెండర్ ఆవిష్కరణ

**యాచారం, ఫిబ్రవరి 20, ప్రభాతవార్త :** జిల్లా సమీకృత కార్యాలయంలో శుక్రవారం జిల్లా పంచాయతీ కార్యదర్శుల క్యాలెండర్ ఆవిష్కరించారు. తెలంగాణ పంచాయతీ సెక్రటరీ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ఆర్గనైజర్ సెక్రెటరీ సురేష్ జిల్లా అధ్యక్షులు రాజేష్ గౌడ్ జిల్లా అధ్యక్షులు నవీన్ యాదవ్, రజినీ కాంత్ రెడ్డి, సూరిబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. పంచాయతీ సెక్రెటరీల సమస్యలు పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శులు నూతన సర్పంచుల, ప్రజల, అధికారులతో సమన్వయంతో పనిచేసి ప్రభుత్వానికి సంఘానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.




## అనుమానస్పదస్థితిలో యువకుడు మృతి

**చేవెళ్ల, జనవరి 20,ప్రభాతవార్త :** అనుమానస్పదంగా ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలోని జర్నలిస్ట్ కాలనీలో శుక్రవారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం శంకర్ పల్లి మండలం పర్వేద గ్రామానికి చెందిన నారగూడెం కృష్ణ (35) ఇంట్లో మరణించి పడి ఉన్నాడని బంధువుల నుంచి మృతుని తల్లి నారగూడెం అంజమ్మకు ఫోన్ చేసి చెప్పారు. సమాచారం తెలుసుకున్న మృతుని తల్లి వెంటనే చేవెళ్లలోని జర్నలిస్ట్ కాలనీలో తన కుమారుడు కృష్ణ ఉంటున్న ఇంటికి వెళ్లి చూడగా కుమారుడు చనిపోయి పడి ఉండడం చూసింది. ఇదే విషయమై తన కోడలు రాజేశ్వరి అలియాస్ లక్ష్మి మ్మ విచారించగా గురువారం రాత్రి మద్యం సేవించి రెండుసార్లు వాంతులు చేసుకున్నాడని తెలిపింది. శుక్రవారం ఉదయం మృతుని పట్నం మహేందర్ రెడ్డి మెడికల్ కళాశాల, ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతను మరణించాడని వైద్యులు ధృవీకరించారు.